PRGI Reg No. TGTEL/25/A0555
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

తెలంగాణ | సంపుటి : 01 | సంచిక 227 | పేజీలు : 8 | వెల రూ.5 | గురువారం 10.09.2026

ఎడిటర్ : చెరుకు ఉపేందర్

Published From Rangareddy
Circulated to All Districts of Telangana and Andhra Pradesh




WANTED REPORTERS

# రైల్వేకు కేంద్రం భారీ నిధులు

## ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సహా దక్షిణాదికి రూ.10,021 కోట్ల రైల్వే ప్రాజెక్టులు

## 540 కిలోమీటర్ల మేర మల్టీట్రాకింగ్ పనులకు కేంద్ర కేబినెట్ ఆమోదం



హైదరాబాద్ – ప్రభాత సూర్యుడు:
రైల్వే మౌలిక వసతుల విస్తరణకు కేంద్ర ప్రభుత్వం భారీ నిర్ణయం తీసుకుంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో రూ.10,021 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న ఐదు మల్టీట్రాకింగ్ రైల్వే ప్రాజెక్టులకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. మొత్తం 540 కిలోమీటర్ల మేర రైల్వే లైన్ల సామర్థ్యాన్ని పెంచే ఈ పనులు 2029–30 నాటికి పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో ఆంధ్రప్రదేశ్‌కు కీలకమైన అరక్కోణం–-రేణిగుంట మార్గంలో 77 కిలోమీటర్ల మేర మూడో, నాలుగో రైల్వే లైన్ల నిర్మాణం చేపట్టనున్నారు. అలాగే సికింద్రాబాద్--ఘట్‌కేసర్--కాజీపేట మార్గంలో 110 కిలోమీటర్ల మల్టీట్రాకింగ్ పనులు చేపట్టనున్నారు. వైట్‌ఫీల్డ్--బంగారుపేట, హోసూరు--ఓమలూరు, సేలం--కరూర్--దిండిగల్ మార్గాల్లోనూ అదనపు రైల్వే లైన్లు నిర్మించనున్నారు. ఈ ప్రాజెక్టులతో రైళ్ల రాకపోకల సామర్థ్యం పెరగడంతో పాటు రద్దీ తగ్గి, ప్రయాణ సమయం మరియు సరకు రవాణా సామర్థ్యంలో మెరుగుదల వచ్చే అవకాశం ఉంది. బొగ్గు, సిమెంట్, ఇనుము, ఉక్కు, ఆహార ధాన్యాలు, ఎరువులు తదితర సరకు రవాణాకు ఈ మార్గాలు మరింత ఉపయోగపడనున్నాయి. అదనంగా ఏటా 4.7 కోట్ల టన్నుల సరకు రవాణా సామర్థ్యం పెరగనుందని రైల్వే శాఖ వెల్లడించింది. ఇదే సమయంలో మరో రూ.10,783 కోట్లతో మూడు మల్టీట్రాకింగ్ ప్రాజెక్టులకు కూడా కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ పనులు పశ్చిమ బెంగాల్, జార్ఖండ్, ఒడిశా, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో 656 కిలోమీటర్ల మేర చేపట్టనున్నారు.

# టీటీడీ పాలకమండలి కీలక నిర్ణయాలు

## భక్తుల భద్రత, ఉద్యోగుల సంక్షేమం, తిరుమలలో పారిశుధ్యం, ప్రసాదాల తయారీ వేగవంతం, ఆలయాల అభివృద్ధికి పలు నిర్ణయాలు





తిరుమల – ప్రభాత సూర్యుడు: తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సమావేశంలో భక్తులు, ఉద్యోగులు, తిరుమల అభివృద్ధికి సంబంధించి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. దేశంలో తొలిసారిగా ఎల్ఐసీ ద్వారా శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులకు సమూహ బీమా సదుపాయం కల్పించేందుకు ఆమోదం తెలిపింది. ప్రమాదవశాత్తు భక్తుడు మరణిస్తే వారి కుటుంబానికి అందించే బీమా పరిహారాన్ని రూ.3 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాలని నిర్ణయించింది. అలాగే తిరుమలలో సహజ మరణం సంభవించిన భక్తుల కుటుంబాలకు రూ.2 లక్షల ఆర్థిక సహాయం అందించే సమూహ బీమా పథకానికి కూడా ఆమోదం తెలిపింది. ఇందుకోసం ఎల్ఐసీకి టీటీడీ నిధుల నుంచి రూ.2.12 కోట్లు చెల్లించనుంది. సీపీఎస్, ఎన్‌పీఎస్ పెన్షనర్లు, వారి కుటుంబాలకు ఉద్యోగుల ఆరోగ్య పథకం సౌకర్యం కల్పించేందుకు రూ.2 కోట్ల యాజమాన్య వాటాకు ఆమోదం తెలిపింది. తిరుమలలోని అన్నప్రసాద కేంద్రం, క్యాంటీన్లు, హోటళ్ల నుంచి వచ్చే ఆహార వ్యర్థాలను వినియోగించి బయోగ్యాస్ తయారు చేసి తిరిగి అన్నప్రసాద కేంద్రానికి సరఫరా చేసే విధంగా ఇండియన్ ఆయిల్ సహకారంతో బయోగ్యాస్ ప్లాంట్ నిర్వహణను జీపీఎస్ రెన్యూవబుల్స్‌కు రూ.2.80 కోట్లతో అప్పగించేందుకు నిర్ణయించింది. శ్రీవారి పోటులో లడ్డూల తయారీని మరింత వేగవంతం చేసేందుకు 400 మంది అదనపు అవుట్‌సోర్సింగ్ సిబ్బందిని నియమించేందుకు ప్రభుత్వ అనుమతికి ప్రతిపాదనలు పంపాలని నిర్ణయించింది. టీటీడీలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న 48 మంది ఉద్యోగుల వేతనాల పెంపునకు ఆమోదం తెలిపింది. తిరుమల పారిశుధ్య నిర్వహణను మరింత మెరుగుపరిచేందుకు అదనపు సిబ్బందికి రవాణా ఛార్జీలుగా మూడేళ్లకు రూ.1.60 కోట్లు మంజూరు చేసింది. గత ఏడాది బ్రహ్మోత్సవాల సందర్భంగా తిరుమలలో ఎఫ్ఎంఎస్‌లో విధులు నిర్వహించిన కార్మికులకు లడ్డూ, వడ అందించేందుకు కూడా నిర్ణయించింది. నారాయణవనంలోని శ్రీ పద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో అమ్మవారి పద్మపీఠానికి బంగారు తాపడం ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. చెన్నైలోని శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయ ధ్వజస్తంభం, బలిపీఠానికి బంగారు తాపడం కోసం రూ.17.05 కోట్లకు ఆమోదం ఇచ్చింది. తిరుపతిలో తెలుగు, సంస్కృత అకాడమీకి కేటాయించిన టీటీడీ భవనం లైసెన్స్ గడువును మరో మూడేళ్లు పొడిగించేందుకు ఆమోదం తెలిపింది. 02–11–2026 నుంచి 01–11–2029 వరకు లైసెన్స్ గడువును పొడిగించనుంది. దాతల సౌకర్యార్థం నామినీల మార్పుకు మరింత వెసులుబాటు కల్పిస్తూ విధాన సవరణకు కూడా ఆమోదం తెలిపింది. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌కు మంజూరు చేసిన రూ.49 కోట్ల ఆర్థిక సహాయంలో భాగంగా రెండో విడతగా రూ.7.56 కోట్లు విడుదల చేసేందుకు ఆమోదం తెలిపింది. పనుల పురోగతి, వినియోగ ధ్రువపత్రాల ఆధారంగా మిగిలిన మొత్తాన్ని విడతల వారీగా విడుదల చేయాలని నిర్ణయించింది. అదనంగా సరఫరా చేసే 10 మిలియన్ లీటర్ల నీటికి మాత్రమే 50 శాతం రాయితీ వర్తింపజేస్తూ ఇందుకు సంబంధించిన అవగాహన ఒప్పందం కుదుర్చుకునేందుకు ఆమోదం తెలిపింది. టీటీడీ ఉద్యోగుల ఆరోగ్య పథకం కింద మే నుంచి జూలై 2026 మధ్య రూ.5 లక్షలకు మించిన వైద్య ఖర్చులు చేసిన 15 మంది ఉద్యోగులు, పెన్షనర్లకు మొత్తం రూ.54.66 లక్షల వైద్య ఖర్చుల రీయింబర్స్‌మెంట్ మంజూరుకు కూడా పాలకమండలి ఆమోదం తెలిపింది.

# గణేశ్ నిమజ్జనం సజావుగా జరిగేలా పనిచేయాలి

## అన్ని శాఖలు ముందస్తు చర్యలు చేపట్టాలి: సీపీ సజ్జనార్




హైదరాబాద్ – ప్రభాత సూర్యుడు:
గణేశ్ విగ్రహాల ప్రతిష్ఠాపన, ఉత్సవాలు, నిమజ్జన ఊరేగింపులను నగరంలో వైభవంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్ వి.సి. సజ్జనార్ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం ఖైరతాబాద్‌లోని విశ్వేశ్వరయ్య భవన్‌లో సీపీ సజ్జనార్ అధ్యక్షతన గణేశ్ ఉత్సవాల నిర్వహణ, నిమజ్జన ఏర్పాట్లపై ఉన్నతాధికారుల సమన్వయ సమావేశం జరిగింది. సమావేశంలో అడిషనల్ సీపీ తఫ్సీర్ ఇక్బాల్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్, జాయింట్ సీపీలు డి. జోయల్ డేవిస్, ఎస్.ఎం. విజయ్ కుమార్, చందనా దీప్తితో పాటు హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజ్‌గిరి, ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ల పోలీసు అధికారులు, కలెక్టర్లు, వివిధ ప్రభుత్వ శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు. గత ఐదేళ్ల అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు నివారణ చర్యలు చేపట్టాలని సీపీ సూచించారు. నిమజ్జన ఊరేగింపు మార్గాల్లో రోడ్లకు అడ్డంగా వేలాడుతున్న విద్యుత్, కేబుల్, ఇంటర్నెట్ వైర్లను వెంటనే తొలగించాలని, రామాంతపూర్ తరహా ప్రమాదాలు పునరావృతం కాకుండా అవసరమైన ఎత్తులో వైర్లకు క్లియరెన్స్ ఉండేలా చూడాలని ఆదేశించారు. గణేశ్ మండపాల నిర్వాహకులకు నిబంధనల ప్రకారం సురక్షిత విద్యుత్ కనెక్షన్లు కల్పించాలని, ఎర్తింగ్ పూర్తి చేసి విద్యుత్ తనిఖీ శాఖ అనుమతులు పొందేలా చూడాలన్నారు. విద్యుత్ సరఫరా నిలిపివేత, వైర్ల తొలగింపు వంటి చర్యలకు ముందు స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. సెప్టెంబర్ 14, 15 నాటికి ప్రధాన మార్గాలు, ప్రత్యామ్నాయ మార్గాల్లో కొనసాగుతున్న రోడ్లు, నాలాలు, స్లాబ్ పనులను పూర్తి చేయాలని సీపీ ఆదేశించారు. నిమజ్జనం పూర్తయ్యే వరకు కొత్తగా రోడ్ల తవ్వకాలు, కేబుల్ పనులు చేపట్టవద్దన్నారు. పాతబస్తీలో మెట్రో నిర్మాణ పనుల కారణంగా చేపడుతున్న విద్యుత్ స్తంభాల మార్పిడి పనులను వేగంగా పూర్తి చేయాలని సూచించారు.

# ఫామ్‌హౌస్‌లోనే కుట్ర..

# వదిలేది లేదు

## స్పీకర్‌ను అవమానించిన వారిపై కఠిన చర్యలు.. తప్పు ఒప్పుకుని క్షమాపణ చెప్పాలి: సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్ – ప్రభాత సూర్యుడు:
తెలంగాణ శాసనసభలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం, అనంతరం చోటుచేసుకున్న పరిణామాలపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని స్పష్టం చేశారు. ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కుట్ర జరిగిందని ఆరోపించిన సీఎం, సెప్టెంబర్ 6 నుంచి చోటుచేసుకున్న పరిణామాలన్నింటినీ క్రోడీకరించి సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ వ్యవహారంపై సీనియర్ పోలీసు అధికారి విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో సమగ్ర విచారణకు ప్రభుత్వం ఆదేశించినట్లు తాజా సమాచారం. కాంగ్రెస్ పార్టీ అంటే దేశంలోని కోట్లాది ప్రజలకు నమ్మకం, భరోసా అని రేవంత్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ దూరదృష్టితో దేశాభివృద్ధికి అనేక చర్యలు చేపట్టిందని, ఎస్సీ, ఎస్టీలకు విద్య, ఉద్యోగాలు, రాజకీయాల్లో రిజర్వేషన్లు కల్పించింది కాంగ్రెస్ విధానమేనని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఏం చేసిందని ప్రశ్నించే వారు పాకిస్థాన్, బంగ్లాదేశ్ పరిస్థితులను కూడా పరిశీలించాలని సూచించారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు ఉత్తరాఖండ్‌లో జరిగిన అవమానకర ఘటనను సీఎం ప్రస్తావిస్తూ, ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇలాంటి చర్యలను సహించరాదన్నారు. ఖర్గేకు జరిగిన అవమానం, తెలంగాణ శాసనసభ స్పీకర్‌కు జరిగిన అవమానం వ్యక్తులకు జరిగినవి మాత్రమే కాదని, రాజ్యాంగబద్ధ సంస్థలకు జరిగిన అవమానంగా చూడాలని అన్నారు. విద్యారంగం, ధరణి, 22ఏ అంశాలపై శాసనసభలో చర్చ జరగకుండా బీఆర్ఎస్ సభ్యులను అడ్డంకులు సృష్టించేలా ఉసిగొల్పారని సీఎం ఆరోపించారు. గత పదేళ్ల పాలనలో జరిగిన పరిణామాలు, రాష్ట్ర అప్పులపై చర్చ జరిగితే ప్రజలకు వాస్తవాలు తెలుస్తాయనే భయంతోనే సభను అడ్డుకునే ప్రయత్నం చేశారని విమర్శించారు. స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా తప్పుబట్టిన రేవంత్‌రెడ్డి, సభాపతి పదవిని, ఆయన కుటుంబాన్ని అవమానించేలా వ్యవహరించడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు. ప్రతిపక్ష నేత కేసీఆర్ బాధ్యత తీసుకుని తన పార్టీ సభ్యులతో క్షమాపణ చెప్పించి సభ సజావుగా జరిగేలా చూస్తారని భావించామని, కానీ అలా జరగలేదని అన్నారు. ఎర్రవల్లి ఫామ్‌హౌస్ వద్ద దళితులు నిర్వహించిన నిరసన అనంతరం అక్కడి ప్రాంతాన్ని శుద్ధి చేసినట్లు వచ్చిన ఆరోపణలను సీఎం తీవ్రంగా ఖండించారు. దళితులు నడిచిన నేలను శుద్ధి చేయడం కాదని, మనసుల్లో పేరుకుపోయిన అంటరానితనం, అహంకారాన్ని శుద్ధి చేయాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించారు. సభాపతి మనసును గాయపరిచిన వారిని వదిలే ప్రసక్తే లేదని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. తప్పు చేసిన వారు దాన్ని అంగీకరించి క్షమాపణ చెబితే వారి స్థాయి తగ్గదని, పైగా గౌరవం పెరుగుతుందని అన్నారు. చట్టపరమైన చర్యల నుంచి కొంతమందికి బెయిల్ లభించినా, తెలంగాణ సమాజం మాత్రం ఇలాంటి చర్యలను క్షమించదని హెచ్చరించారు. స్పీకర్‌ను అవమానించిన ఘటనపై ఇప్పటికే ఇద్దరు బీఆర్ఎస్ ఎమ్మెల్సీలను పోలీసులు అరెస్టు చేయగా, కోర్టు రిమాండ్ తిరస్కరించడంతో వారు వ్యక్తిగత పూచీకత్తుపై విడుదలయ్యారు. తెలంగాణ సమాజంలో అశాంతిని పెంచే చర్యలను ప్రభుత్వం సహించబోదని, కుట్రకు పాల్పడిన వారితో పాటు అందులో భాగస్వాములైన వారిపై కూడా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

# స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా ధర్నా




అబ్దుల్లాపూర్‌మెట్ – ప్రభాత సూర్యుడు:
శాసనసభ స్పీకర్‌పై ఎమ్మెల్సీ తాత మధు అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ జీఎస్ సేవా సమితి చైర్మన్, మాజీ కౌన్సిలర్ గ్యారాల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో పెద్ద అంబర్‌పేట్, కుంట్లూరు డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కుంట్లూరు కూడలిలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్, కేసీఆర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కేసీఆర్ చిత్రపటానికి నిప్పంటించేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకోవడంతో కొంతసేపు తోపులాట చోటుచేసుకుంది. అనంతరం ఆందోళనకారులను పోలీసులు అరెస్టు చేసి హయత్‌నగర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా గ్యారాల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న శాసనసభ స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. స్పీకర్ పదవికి, శాసనసభ గౌరవానికి భంగం కలిగించేలా వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. దళితుల పట్ల బీఆర్ఎస్ నేతలకు మొదటి నుంచీ చిన్నచూపు ఉందని, మహిళలను గౌరవించడం లేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం చైర్మన్ కొత్తపల్లి జైపాల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భాస్కరాచారి, మాజీ వైస్ చైర్మన్ సిద్దెంకి కృష్ణారెడ్డి, మాజీ ఎంపీటీసీలు చేగూరి వెంకటేష్, భీమగోని భాస్కర్‌గౌడ్, సీనియర్ నాయకులు కందాడి సుప్రసేనా రెడ్డి, యువజన నాయకుడు పాలడుగు నాగార్జునతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలి : కలెక్టర్ సి. నారాయణరెడ్డి

## ప్రజావాణికి 56 ఫిర్యాదులు



రంగారెడ్డి జిల్లా – ప్రభాత సూర్యుడు:
ప్రజల నుంచి అందే ప్రతి ఫిర్యాదును అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించి, నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చి వినతిపత్రాలు సమర్పించారు. మొత్తం 56 ఫిర్యాదులు అందగా, వాటిలో రెవెన్యూ శాఖకు సంబంధించినవి 27, ఇతర శాఖలకు సంబంధించినవి 29 ఉన్నాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీలను ఎట్టి పరిస్థితుల్లోనూ పెండింగ్‌లో ఉంచకుండా నిరంతరం సమీక్షిస్తూ సత్వరమే పరిష్కరించాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని తెలిపారు. ప్రజావాణి అనంతరం కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో రూపొందించిన 'మట్టి గణపతిని పూజిద్దాం--పర్యావరణాన్ని పరిరక్షిద్దాం' పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ నెల 14న వినాయక చవితి సందర్భంగా ప్రజలు ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు బదులుగా మట్టి గణపతి విగ్రహాలను ప్రతిష్ఠించాలని సూచించారు. సహజసిద్ధమైన రంగులు, పర్యావరణహిత అలంకరణలను వినియోగిస్తూ పండుగను పర్యావరణహితంగా నిర్వహించాలని కోరారు. ప్రజల్లో అవగాహన కల్పించేందుకు సంబంధిత శాఖలు విస్తృత ప్రచారం నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి శారద, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# పుల్లయ్య మృతికి ఎస్కే చాంద్ సంతాపం



రామన్నపేట – ప్రభాత సూర్యుడు:
రామన్నపేట పట్టణానికి చెందిన కేశవబోయిన వెంకటేశం (ఉపాధ్యాయుడు) తండ్రి, రిటైర్డ్ ఉద్యోగి కేశవబోయిన పుల్లయ్య సోమవారం పరమపదించారు. ఆయన మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించిన టీఆర్ఎస్ మాజీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్కే చాంద్, కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం నిర్వహించిన అంతిమయాత్రలో ఎస్కే చాంద్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కందుల నరసింహ, పెద్దబోయిన మురళి, కందుల హనుమంతు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణాన్ని కాపడటం ప్రతి ఒక్కరి భాద్యత

- ఆదిభట్ల సర్కిల్ లో ఉచితం మట్టి వినాయక విగ్రహాల పంపిణీ
- అసిస్టెంట్ మున్సిపల్ కమీషనర్ రమేష్



ఆదిభట్ల – ప్రభాత సూర్యుడు:
వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా ఆదిభట్ల వార్డు కార్యాలయంలో ప్రజలకు ఉచితంగా మట్టి వినాయక విగ్రహాలను అందుబాటులో ఉంచారు. వార్డు ప్రజలు కార్యాలయానికి వచ్చి మట్టి విగ్రహాలను ఉచితంగా తీసుకెళ్లి పర్యావరణహితంగా వినాయక చవితి వేడుకలను నిర్వహించుకోవచ్చని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ మున్సిపల్ కమీషనర్ రమేష్ మాట్లాడుతూ రసాయన పదార్థాలు, కృత్రిమ రంగులతో తయారు చేసిన విగ్రహాలను నిమజ్జనం చేయడం వల్ల నీటి వనరులు కలుషితమయ్యే ప్రమాదం ఉందన్నారు. రసాయన రంగులు, ఇతర పదార్థాలు నీటిలో కలవడం వల్ల జలజీవులు, పర్యావరణంపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని తెలిపారు. మట్టి వినాయక విగ్రహాలను వినియోగించడం ద్వారా నీటి కాలుష్యాన్ని తగ్గించడంతో పాటు పర్యావరణాన్ని పరిరక్షించవచ్చని అధికారులు పేర్కొన్నారు. ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఆదిభట్ల వార్డు ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మట్టి వినాయక విగ్రహాలతో పర్యావరణహితంగా పండుగను జరుపుకోవాలని కోరారు.

# అసెంబ్లీకి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అడ్డుకోవడంపై నిరసన

## ఇబ్రహీంపట్నంలో•ధర్నా రాస్తారోకో•సీఎం దిష్టిబొమ్మ దగ్ధం



ఇబ్రహీంపట్నం – ప్రభాత సూర్యుడు:
అసెంబ్లీ సమావేశాలకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అడ్డుకోవడంపై కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. మంగళ్‌పల్లి చౌరస్తా సాగర్ హైవేపై బీఆర్ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి (బంటి) ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ధర్నా, రాస్తారోకో చేపట్టారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు సహా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అసెంబ్లీలో ఎదుర్కోలేక వారి గొంతు నొక్కేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని నాయకులు ఆరోపించారు. ప్రజా సమస్యలపై మాట్లాడే ప్రతిపక్ష ఎమ్మెల్యేలకు అసెంబ్లీలో అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేసి కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# విద్యతోపాటు భావవ్యక్తీకరణ నైపుణ్యాలు అవసరం

## పల్లవి ఇంజనీరింగ్ కళాశాలలో ఘనంగా ఎంబీఏ ఓరియంటేషన్




కుంట్లూర్ – ప్రభాత సూర్యుడు:
అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కుంట్లూర్‌లోని పల్లవి ఇంజనీరింగ్ కళాశాలలో 2026--28 విద్యా సంవత్సరానికి చెందిన ఎంబీఏ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వ్యాపార నిర్వహణ నిపుణులు శివ ప్రసాద్ హాజరై, వ్యాపార రంగంలో అందుబాటులో ఉన్న ఉపాధి అవకాశాలు, నైపుణ్యాల ప్రాధాన్యత, ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు అభివృద్ధి చేసుకోవాల్సిన సామర్థ్యాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మల్క కొమరయ్య, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మల్క నవీన్, అకడమిక్ అడ్వైజర్ ఆచార్య ఎస్.జి.ఎస్. మూర్తి, యాజమాన్య ప్రతినిధి బీరెల్లి కమలాకర్, ప్రిన్సిపాల్ డా. జె.బి.వి. సుబ్రహ్మణ్యం, వైస్ ప్రిన్సిపాల్ డా. ఆర్. ప్రశాంత్ కుమార్ పాల్గొని నూతన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ విభాగాధిపతి డా. వై. శారద మాట్లాడుతూ ఎంబీఏ కోర్సు ప్రాధాన్యత, వ్యాపార నిర్వహణ రంగంలో భవిష్యత్ అవకాశాలు, విద్యార్థులు తమ కెరీర్‌కు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవాల్సిన అవసరాన్ని వివరించారు. విద్యతో పాటు ఆచరణాత్మక పరిజ్ఞానం, నాయకత్వ లక్షణాలు, కమ్యూనికేషన్ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపక బృందం, ఎంబీఏ నూతన విద్యార్థులు పాల్గొన్నారు.

# పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

## బీఆర్ఎస్ హయాంలో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదు: ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి




అబ్దుల్లాపూర్‌మెట్ – ప్రభాత సూర్యుడు:
పేద ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని పట్టించుకోకుండా ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వకుండా వారి పొట్ట కొట్టిందని విమర్శించారు. అబ్దుల్లాపూర్ మెట్ మండల కేంద్రంలోని వైఎన్ఆర్ గార్డెన్స్‌లో శనివారం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి పేద ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డులు మంజూరు చేస్తున్నారని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సన్నబియ్యం పంపిణీ చేస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని అన్నారు. పేదలకు అండగా నిలిచే విధంగా ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలను కొనసాగిస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# నకిరేకల్ సభకు

# అన్న డుమ్మా.. తమ్ముడు దోస్తీ

- రేవంత్ నకిరేకల్ పర్యటనలో ఆసక్తికర పరిణామం
- వేదికపైకి రాకుండానే హెలికాప్టర్‌లో వెళ్లిపోయిన మంత్రి

నకిరేకల్ – ప్రభాత సూర్యుడు:
ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నకిరేకల్ పర్యటనలో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. ముఖ్యమంత్రి పాల్గొన్న బహిరంగ సభకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హాజరు కాలేదు. ముఖ్యమైన పని ఉందంటూ సభా వేదికపైకి రాకుండానే హెలికాప్టర్‌లో వెళ్లిపోయినట్లు సమాచారం. నకిరేకల్‌లో సీఎం పర్యటనలో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు, అనంతరం రాజీవ్‌గాంధీ మినీ స్టేడియంలో బహిరంగ సభ నిర్వహించారు. సభ ముగిసిన అనంతరం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రోడ్డు మార్గంలో హైదరాబాద్‌కు వెళ్లిపోయారు. ఇదిలా ఉండగా, గతంలో సీఎం కార్యక్రమాలకు దూరంగా ఉన్న కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి దక్కే అవకాశం ఉందన్న ప్రచారం నేపథ్యంలో ఆయన ఈ సభకు హాజరై ముఖ్యమంత్రితో సన్నిహితంగా మెలగడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. రాజగోపాల్‌రెడ్డి గత సభలకు హాజరు కాకపోవడం, తాజాగా నకిరేకల్ సభకు హాజరై రేవంత్‌రెడ్డిని తనకు ప్రాణమిత్రుడిగా పేర్కొంటూ వ్యవహరించడం వెనుక రాజకీయ సమీకరణాలే కారణమా అన్న చర్చ కాంగ్రెస్ వర్గాల్లో సాగుతోంది. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సభకు దూరంగా ఉండటం, మరోవైపు రాజగోపాల్‌రెడ్డి హాజరు కావడం కాంగ్రెస్‌లోని అంతర్గత రాజకీయాలపై కొత్త చర్చకు దారితీసింది.



# సంపాదకీయం

## ట్రంపరితనంను ఎదురించాల్సిందే !

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హద్దుమీరి ప్రవర్తిస్తున్న తీరు మరోమారు ప్రపంచ వ్యాప్తంగా నిరసనలు వ్యక్తం అవుతున్నాయి. ఏ దేశం ఎవరితో దోస్తానా చేయాలో..ఎవరితో వాణిజ్యం చేయాలో అన్న ఆంక్షలు విధించే హక్కు ట్రంప్‌కు ఎక్కడిదని ప్రశ్నించాలి. ఈ విషయంలో మోడీ దేశ సార్వభౌమాధికారాన్ని నిలబెట్టాలి. ట్రంప్ ఆంక్షలను అంగీకరించేది లేదని గట్టిగానే చెప్పాలి. చర్చలు జరిపేది లేదంటున్న ట్రంప్‌తో మనం కూడా అంతే మొండి వైఖరితో ఉండాలి. 140 కోట్ల జనాభా ఉన్న భారత్‌తో పెట్టుకుంటే ఏమవుతుందో చెప్పగలగాలి. ఒకవైపు మనపై వాణిజ్య ఆంక్షలు విధిస్తూ..మరోవైపు పాక్‌ను దువ్వుతున్న తీరు అమెరికా ద్వంద్వ నీతిని తెలియ చేస్తోంది. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న భారత్‌పై అమెరికా విధించిన అదనపు సుంకాలు తీవ్ర దుమారం రేపుతున్న వేళ ట్రంప్ ఏ మాత్రం తగ్గేది లేదన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ఈ విషయంలో రెండు దేశాల మధ్య ఓ రకంగా విభేదాలు పొడసూపి నట్లుగానే భావించాలి. ట్రంప్ ఏకపక్ష నిర్ణయాలు భారత్‌కు పరీక్షగా మారాయి. ఈక్రమంలో మోడీ కూడా మనదేశ సార్వభౌమాధికారాన్ని కాపాడుకుంటూనే ముందుకు సాగాలి. ప్రపంచంలోనే అత్యధిక సుంకాలను తమపై విధించడంతో భారత్ దీటుగా స్పందించింది. తమ దేశంలోని రైతులు, మత్స్యకారులు, పాల ఉత్పత్తుల రంగంలోని వారి ప్రయోజనాలే ముఖ్యమని స్పష్టం చేసింది. అవసరమైతే ఆ భారాన్ని తామే భరిస్తామని వెల్లడించింది. మరోవైపు భారత్‌పై మరిన్ని ఆంక్షలను విధిస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. ఇక ఆయన విధించిన సుంకాలు గురువారం నుంచి అమల్లోకి వచ్చాయి. దీనివల్ల అమెరికాలో కొన్నింటి ధరలు పెరగనున్నాయి. అయితే, అమెరికా అదనపు సుంకాల వల్ల రెండు దేశాల మధ్య తలెత్తిన వివాదం తాత్కాలికమేనని, త్వరలోనే సమసిపోతుందని ప్రవాస భారతీయ సంఘాలు అభిప్రాయపడుతున్నాయి. చర్చలు ఫలించి త్వరలో ఒప్పందం కుదరనుందనే ఆశాభావం వ్యక్తం చేశాయి. 50 లక్షల మంది ప్రవాస భారతీయులు అమెరికా అభివృద్ధిలో భాగస్వాములుగా ఉన్నారని పేర్కొన్నారు. భారతీయ ఉత్పత్తులపై 50శాతం సుంకాలను వేయడాన్ని ఇండియన్-అమెరికన్ల నేత, బైడెన్ మాజీ సలహాదారు అజయ్ భుటోరియా ఖండించారు. 'అమెరికాలో తక్కువ ధరలకు లభించే 50శాతం జనరిక్ మందులను భారత్ సరఫరా చేస్తోంది. ఈ సుంకాలు వాటి ధరలను పెంచుతాయి. దీనివల్ల అమెరికాలోని కుటుంబాలు, సీనియర్ సిటిజన్లు, చిన్న వ్యాపారులు ఇబ్బందులు పడతారు. మసాలా దినుసులు, పప్పులు, దీపావళి దుస్తుల ధరలు పెరుగుతాయని పేర్కొన్నారు. దుస్తులు, పాదరక్షల ధరలు 37శాతం దాకా పెరగవచ్చని అభిప్రాయపడ్డారు. ఇది ఎలా ఉన్నా మనం కూడా తగ్గేదేలా లేదన్నట్లుగా వ్యవహ రించాలి. కాంగ్రెస్ ఎంపి శశిథరూర్ ఇదే విషయాన్ని గుర్తుచేశారు.. ట్రంప్ విధించిన అదనపు సుంకాలపై ప్రధాని మోదీ గట్టిగా సమాధానమిచ్చారు. తమ రైతుల ప్రయోజనాల విషయంలో ఎప్పటికీ రాజీ పడబోమని, దానికి ఎంత మూల్యమైనా చెల్లించడానికి సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. రైతుల ప్రయోజనాలే మాకు అత్యంత ముఖ్యం. రైతులు, మత్స్యకారులు, డెయిరీ ఉత్పత్తిదారుల ప్రయోజనాల విషయంలో భారత్ ఎప్పటికీ రాజీ పడబోదు. వారిని కాపాడటం కోసం సుంకాల భారాన్ని సొంతగా భరించడానికీ సిద్ధం అని ప్రధాని స్పష్టం చేశారు. రష్యా నుంచి చమురు కొంటుందన్న కారణంతో భారత్‌పై 50శాతం సుంకాలను విధించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. మరో బాంబు పేల్చారు. తదుపరి మరిన్ని ఆంక్షలను చూస్తారంటూ హెచ్చరించారు. శ్వేత సౌధంలోని ఓవల్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'భారత్‌పై మేం 50శాతం సుంకాలను విధించిన విషయం మీకు తెలుసు. ఆ దేశం రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకునే దేశాల్లో రెండో స్థానంలో ఉంది. తొలిస్థానంలో ఉన్న చైనాకు అతి దగ్గరగా ఉంది. అందుకే భవిష్యత్తులో మరిన్ని ఆంక్షలను చూడబోతున్నారని పేర్కొన్నారు. ట్రంప్ తీరు చూస్తుంటే పిచ్చోడి చేతిలో రాయిలా ఉంది. తన వైఖరిని నెగ్గించుకోవడమే ఆయనకు ముఖ్యంగా ఉంది. ఎలన్ మస్క్ లాంటి వారినే దూరం పెట్టిన ట్రంప్‌కు భారత్ ప్రయోజనాలు ముఖ్యం కాదు. ఇకపోతే ఆపరేషన్ సింధూర్ తరవాత భారత్ సైనికంగా బలపడడంతో కూడా ట్రంప్ తట్టుకోవడం లేదని తెలుస్తోంది. ఇది కూడా ట్రంప్ వైఖరికి కారణం కావచ్చని వశ్లేషిస్తున్నారు. భారత్‌పై గతంలో విధించిన 25శాతం సుంకాలు గురువారం నుంచి అమల్లోకి వచ్చాయి. అదనంగా విధించిన మరో 25శాతం ఈ నెల 27వ తేదీ నుంచి అమల్లోకి వస్తాయి. మన దేశంతోపాటు అనేక దేశాలపై సుంకాలు గురువారం నుంచే అమల్లోకి వచ్చాయి. దీనివల్ల బిలియన్ల కొద్దీ డాలర్లు అమెరికాకు వస్తాయని ట్రంప్ ప్రకటించారు. ఈ సుంకాలు 10శాతం నుంచి 50శాతం దాకా ఉన్నాయి. మోడీ అధికారంలోకి వచ్చిన తరవాత గత పదకొండేళ్లుగా ఇలా ఎప్పుడూ జరగలేదు. అవినీతిరహితంగా పాలన సాగుతుందన్న పేరు వచ్చింది. అలాగే సాహసోపేత నిర్ణయాలు కూడా తీసుకుని సత్తా చాటింది. అయోధ్య, కాశ్మీర్, ట్రిపుల్ తలాక్ విషాయల్లో సాహసోపేత నిర్ణయాలు తీసుకున్నారు. ఇటీవల ఆపరేషన్ సిందూర్ ద్వారా మన సైనిక సత్తా చాటాం. పాక్‌కు గట్టిగా బుద్ధి చెప్పాం. ప్రపంచవ్యాప్తంగా భారత్చర్యలకు గట్టి మద్దతు లభించింది. మోడీ సర్కార్ సాహస నిర్ణయాలకు వెనకాడదని రుజువు చేసుకుంది. సర్జికల్ స్ట్రయిక్స్ తరవాత, ఆపరేషన్ సిందూర్తరవాత కూడా పాక్ వైఖరిలో మార్పు రాలేదు. దాయాది దేశాన్ని ప్రపంచంలో దోషిగా నిలబెట్టిన ఘనత మోడీదే అని చెప్పక తప్పదు. ట్రంప్ విషయంలో ఏ నిర్ణయం తీసుకుంటారో అని దేశం ఆసక్తిగా ఎదురు చూస్తోంది. ఈ క్రమంలో భారత్ తన సార్వభౌమాధికరం ముఖ్యమని చాటి చెప్పాలి.

## మా భూములకు రక్ష కెటిఆర్ అన్న



మొదటి పేజీ తరువాయి

అధికారులు, పోలీసులు దౌర్జన్యం చేశారని, ఆమె భర్తను జైలుకు పంపిన, సమయంలో కేటీ-ఆర్ ఢిల్లీ వెళ్లి పలు కమిషన్లకు ఫిర్యాదులు చేసి, జ్యోతితో పాటు- లగచర్ల గిరిజనులకు, పేద రైతన్నలకు జరుగుతున్న అన్యాయాన్ని ఢిల్లీ వేదికగా ఎండగట్టారు. దీని ఫలితంగా, ప్రభుత్వం భూసేకరణను వెనక్కి తీసుకుందని వారు తెలిపారు. కేసుల కారణంగా జైలుపాలైన లగచర్ల సోదర సోదరీమణులందరికీ కేటీఆర్ అన్నగా అండగా నిలబడి, న్యాయ సహాయం అందించారని, అందరినీ జైలు నుంచి విడిపించారని వారు తెలియజేశారు.

# ప్రైవేట్ డ్రైవర్లనూ వదలని సర్కార్

## బీమా ఎగ్గొట్టారని మండిపడ్డ కెటిఆర్



హైదరాబాద్-ప్రభాత సూర్యుడు

కేవలం 20 నెలల్లోనే అన్ని వర్గాలను వంచించిన దగాకోరు రేవంత్ సర్కార్.. ప్రైవేట్ రంగంలోని డ్రైవర్లను సైతం నట్టేట ముంచిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. ఎన్నికల ముందు అసంఘటితరంగ కార్మికులకు, గిగ్ వర్కర్లకు అరచేతిలో వైకుంఠం చూపించిన రేవంత్.. గద్దెనెక్కాక ఉన్న పథకాన్ని కూడా ఊడగొట్టాడు! అని ధ్వజమెత్తారు.మహోదాత్త హృదయంతో, మానవీయ కోణంతో కేసీఆర్ ప్రభుత్వం ప్రారంభించిన డ్రైవర్లకు రూ. 5 లక్షల ప్రమాద బీమా పథకానికి ఇన్స్యూరెన్స్ ప్రీమియం ఎగ్గొట్టి, కాంగ్రెస్ ప్రభుత్వం బంద్ పెట్టింది.. నిరుపేద డ్రైవర్ల కుటు-ంబాలకు క్షోభను మిగిల్చింది అని కేటీ-ఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. 2024 అక్టోబర్ నుండి పథకాన్ని ఆపేసి.. ప్రమాదవశాత్తు మరణించిన డ్రైవర్ల కుటు-ంబాలను రేవంత్ రోడ్డున పడేశాడు అని కేటీ-ఆర్ పేర్కొన్నారు. రైతు బీమా, నేతన్నకు బీమా, డ్రైవర్లకు బీమా వంటి ఎన్నో పథకాలతో సబ్బండ వర్ణాల ప్రజల భవిష్యత్తుకు కేసీఆర్ ధీమా అందిస్తే.. ఒక్కో పథకానికి మంగళం పాడి పేద కుటు-ంబాల భవిష్యత్తును అగమ్యగోచరంగా మారుస్తోంది ఈ కర్కశ కాంగ్రెస్ ప్రభుత్వం. రూ. 5 లక్షల ప్రమాద బీమా పథకాన్ని తిరిగి ప్రారంభించాలని, పెండింగ్ క్లెయిమ్‌లను వెంటనే సెటిల్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం.. లేకుంటే డ్రైవర్ల పక్షాన పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టి, ఈ అమానవీయ సర్కార్ మెడలు వంచుతామని కేటీఆర్ హెచ్చరించారు.

# అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తికి ఊరట

## నిషేధిత ఉత్తర్వులను వెనక్కి తీసుకున్న సుప్రీం

న్యూఢిల్లీ-ప్రభాత సూర్యుడు

అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తికిఊరట దక్కింది. గంతలో విధించిన నిషేధ ఉత్తర్వులను సుప్రీం వెనక్కు తీసుకుంది. హైకోర్టు జడ్జిపై ఆంక్షల విషయంలో గతంలో వెలువరించిన ఉత్తర్వులను సుప్రీంకోర్టు ఉపసంహరించుకుంది. అలహాబాద్ హైకోర్టుకు చెందిన ఓ న్యాయమూర్తి రిటైరయ్యేంతవరకూ ఆయనకు క్రిమినల్ కేసులు అప్పగించకూడదని ఆంక్షలు విధిస్తూ ఈనెల 4న వెలువరించిన ఉత్తర్వులను ఉపసంహరించుకుంటున్నట్లు పేర్కొంది. సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ అభ్యర్థన మేరకు న్యాయమూర్తులు జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ ఆర్.మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం దీనిని వెనక్కి తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ కేసు విషయంలో తీర్పును పునఃపరిశీలించాలని కోరుతూ భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ నుంచి తమకు లేఖ అందిందని ధర్మాసనం పేర్కొంది. సంబంధిత న్యాయమూర్తికి ఇబ్బందులు కలిగించడం తమ ఉద్దేశం కాదని.. అయితే కొన్ని విషయాల్లో పరిమితులు దాటినప్పుడు న్యాయవ్యవస్థ గౌరవాన్ని కాపాడటమే కోర్టు పనిచేస్తుందని జస్టిస్ పార్దివాలా పేర్కొన్నారు. అంతకు ముందు ఇచ్చిన ఉత్తర్వులను వెనక్కి తీసుకున్నప్పటికీ అలహాబాద్ హైకోర్టు తీర్పు చట్టవిరుద్ధమని ఆందోళన వ్యక్తంచేశారు. న్యాయవ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీసే ఇటువంటి ఆదేశాలను విస్మరించలేమని స్పష్టం చేశారు. ఒక సివిల్ వివాదంలో క్రిమినల్ చర్యలకు అనుమతినిస్తూ అలహాబాద్ హైకోర్టుకు చెందిన ఓ న్యాయమూర్తి ఇటీవల జారీచేసిన ఆదేశాలకు సంబంధించిన కేసులో రి-టైరయ్యేంత వరకూ ఆయనకు ఎలాంటి క్రిమినల్ కేసులు అప్పగించవద్దని ఈనెల 4న సుప్రీం ధర్మాసనం ఆదేశించింది. ఈ వ్యవహారంలో సుప్రీంకోర్టు ఆదేశంలోని కొన్ని అంశాలు అమలుకాకుండా నిరోధించేందుకు ఫుల్ కోర్టును సమావేశపరచాలని అలహాబాద్ హైకోర్టుకు చెందిన 13 మంది న్యాయమూర్తులు గురువారం అలహాబాద్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి ఒక లేఖ రాశారు. హైకోర్టులపై పాలనాపరమైన పర్యవేక్షణ అధికారం సుప్రీంకోర్టుకు లేదని, అందుకే ఆగస్టు 4నాటి సుప్రీం ఆదేశాల్లో 24వ, 26వ పేరాల్లోని నిర్దేశాలను అమలుచేయరాదని ఫుల్‌కోర్టు తీర్మానించాలని జడ్జీలు కోరారు. ఈ నేపథ్యంలో 'సుప్రీం' తన ఉత్తర్వులను వెనక్కి తీసుకుంది.

# అలీబాబా 40 దొంగలు

## - కెసిఆర్ కుటుంబానికి ఇది సరిపోతుంది
## - అప్పులు చేసి దోచుకోవడంలో అందవేసిన చేయి
## - కాంగ్రెస్ వర్కింగ్ ప్రసిడెంట్ జగ్గారెడ్డి




హైదరాబాద్-ప్రభాత సూర్యుడు

తెలంగాణ రాష్ట్రాన్ని కేసీఆర్ అడ్డంగా దోచుకున్నారని కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి మండిపడ్డారు. ఎంత దొరికితే అంత దోచుకున్నారని విమర్శించారు. అప్పులుల తెచ్చి అప్పుల్లోనూ కమిషన్లు దండుకున్న ఫ్యామిలీ వారిదని మండిపడ్డారు. శుక్రవారం గాంధీభవన్‌లో జగ్గారెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ.. ఇంకా చెప్పాలంటే అంచనా వేయలేనంతగా రాష్ట్రాన్ని దోచి పడేశారని తెలిపారు. అవినీతి ఎలా చేయాలో అనే యూనివర్సిటీకి కేసీఆర్ ప్రొఫెసర్ అని అభివర్ణించారు. రాష్ట్ర ప్రజల ఖజానా దోచుకోవడంలో కేసీఆర్ ఫ్యామిలీ దిట్ట అని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని అడ్డగోలుగా దోచుకొని.. సుద్దపూసలాగా.. నంగనాచి మాటలు మాట్లాడుతున్నారని కేసీఆర్ ఫ్యామిలీపై నిప్పులు చెరిగారు. అలీబాబా నలభై దొంగలు అనే -టైటిల్ కేసీఆర్ ఫ్యామిలీకి కరెక్ట్ సెట్ అవుతుందని స్పష్టం చేశారు. వారు స్థాపించిన పార్టీలోని కొత్త ప్రభాకర్ సుద్దపూసలాగా మాట్లాడుతున్నాడని చెప్పారు. ప్రజలకి ఏమైనా చేద్దామంటే ఖజానాలో మిగుల్చకుండా దోచుకొని పోయారంటూ కేసీఆర్ ఫ్యామిలీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదిలావుంటే బీఆర్ఎస్ నేత, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డిపై జగ్గారెడ్డి మరోసారి నిప్పులు చెరిగారు. నువ్వు నా క్యారెక్టర్ అంచనా వేయలేవంటూ కొత్త ప్రభాకర్ రెడ్డికి సూచించారు. రాష్ట్రంలో ఎవర్ని అడిగినా నా క్యారెక్టర్ గురించి చెబుతారన్నారు. నా క్యారెక్టర్‌కి, ప్రభాకర్ రెడ్డి క్యారెక్టర్‌కి చాలా తేడా ఉంటు-ందని పేర్కొన్నారు. ప్రభాకర్ రెడ్డికి ఉన్నంత ఆస్తి నా వద్ద ఉంటే ప్రజలకి ఎప్పుడో పంచేసే వాడినని తెలిపారు. పంచే గుణం మా అమ్మనాన్న నాకు ఇచ్చిన ఆస్తి అని చెప్పారు. భవిష్యత్తులో నేను రూ. వేల కోట్లు- సంపాదించినా వాటిని ప్రజలకే పంచుతానని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. నా ఆస్తి నా పిల్లల కోసం కాదని.. ప్రజల కోసమని తెలిపారు. రూ. 1000 కోట్లు- కొన్ని గంటల్లోనే పంచేస్తానన్నారు. ప్రభాకర్ రెడ్డికి ఎలా పంచాలో కూడా తెలియదని ఆక్షేపించారు. నేను ఎలాంటి వాడినో కేసీఆర్, హరీష్ రావుని అడిగి తెలుసుకోవాలంటూ ప్రభాకర్ రెడ్డికి సూచించారు. కొత్త ప్రభాకర్ రెడ్డి.. నీవు మగాడవయితే నా ప్రశ్నలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రభాకర్ రెడ్డిది నా స్థాయి కాదన్నారు. కొన్ని విషయాల్లో ఎమోషనల్ కావ్వడం నా బలహీనత అని తెలిపారు. ప్రజల సమస్య వింటే వాళ్ళ కంటే ముందు నాకే ఏడుపు వస్తుందన్నారు. నా చుట్టూ పేదలు ఉంటారని.. నా వద్దకు క్యాన్సర్ పేషెంట్లు- సైతం వస్తారని చెప్పారు. నేనేమైనా ప్యాకేజీల లీడర్ నా అంటూ బీఆర్ఎస్ నేతలను ఈ సందర్భంగా జగ్గారెడ్డి సూటిగా ప్రశ్నించారు. నేనేమి బీ ఫారంలు కొనుకొని రాలేదని వ్యంగ్యంగా అన్నారు. దొంగతనాలు మీరు చేసి.. మాపై నిందలు వేస్తారా? అంటూ బీఆర్ఎస్ నేతలను ఆయన సూటిగా ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ మీలాగా ప్రైవేట్ కంపెనీనా? అని వారిని నిలదీశారు. ఇసుక దందాలలో మీరు సంపాదించింది ఎంత? అంటూ ఆ పార్టీ నేతలను ఆయన ప్రశ్నించారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని భూములు, చెరువులు కబ్జా చేసింది బీఆర్ఎస్ నాయకులేనని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.

# ఫసల్ బీమా యోజనతో రైతులకు అండ

## ప్రభుత్వ నిర్ణయంతో రైతుల్లో ఆనందం





హైదరాబాద్-ప్రభాత సూర్యుడు

కేంద్రం తీసుకుని వచ్చిన ఫసల్ బీమాలో చేరాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో రైతులకు మేలు జరుతుందని కూడా తెలిపింది. రైతులను ఆదుకునే క్రమంలో పసల్ బీమా యోజనలో చేరడం, రైతల కిస్తీకూడా ప్రభుత్వమే భరిస్తుందిన సిఎం, డిప్యూటి సిఎంలు కూడా వెల్లడించారు. రైతులకు కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం రైతాంగానికి వెన్నుదన్నుగా నిలుస్తుంది..ప్రకృతి కరుణించక అనుకోని వైపరీత్యాలతో పంట నష్టపోతూ... ఇక వ్యవసాయం వద్దు అనుకునే రైతన్నకు ప్రధానమంత్రి ఫసల్ భీమ యోజన అండగా నిలుస్తోంది. దేశానికి వెన్నుముక రైతు , రైతు పంటలు పండిస్తేనే ప్రజలకు ఐదు వేళ్ళు నోట్లోకి వేలుతాయి. అలాంటి రైతు తాము పండించిన పంటకు అకాల వర్షాలతోనో అనుకోని వైపరీత్యాలతో పంట నష్టపోతే అ రైతు పరిస్తితి ఏంటి అనుకునే తరుణంలో ఫసల్ బీమాయోజన వారికి ఆసరాగా నిలిచింది. పంట నష్టపోయిన రైతన్నను అమ్మలా అదుకుంటూతుంది. వ్యవసాయం దండుగ అని గతంలో అన్న రైతుకు వ్యవసాయం పండుగా అనేలా ప్రతి రైతు ప్రకృతి వైపరీత్యాలకు బెదరకుండా తమ భూమిని సాగు చేసి వ్యవసాయాన్ని చేసే దైర్యాన్ని ఇస్తుంది.. ఫసల్ బీమా యోజన పథకం. రైతు తాము పండించే పంట పెట్టుబడి ఎకరాకు అందులో రెండు శాతం ఫసల్ బీమా పథకం ప్రీమియం కడితే చాలు వరిపంటకు ఎకరాకు 34 వేల బీమా ఉండగా అందులో రెండు శాతం అంటే 680 రూపాయలు ప్రీమియం కడితే చాలు అలగే మొక్క జొన్న ... వేరుశనిగే పంటలకు రెండు శాతం ఉండగా పసుపు పంటకు మాత్రం 3.5 శాతం ప్రీమియం చెల్లించాల్సి ఉంది.. దీంతో రైతుకు ఎదురయ్యే ఇబ్బందులు తెగుళ్ళు .. వడగళ్ళు.. పిడుగులు.. అకాల వర్షాలతో పంట నష్టపోతే ఆ రైతుకు ఫసల్ బీమా రక్షణగా నిలుస్తుంది.. వీటితో పాటు ఇందులోనే వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం ద్వారా పత్తి పంటతో పాటు మిర్చిపంటకు కూడా రైతు 5 శాతం ప్రీమియం చెల్లిస్తే వాతావరణం అనుకులించ కున్న వేసిన విత్తనం మొలకేత్తకపోయిన రైతుకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పంట పెట్టుబడి నష్ట పోకుండా ఫసల్ బీమా పథకం అండగా నిలుస్తుంది. పంటకోత తర్వాత జరిగే నష్టాలకూ బీమా వర్తిస్తుంది. పంటనష్టం జరిగిందని తెలియగానే బీమా మొత్తంలో 25 శాతం మొత్తాన్ని నేరుగా రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేస్తారు. అంతేకాదు క్లెయిమ్ సెటిల్ కోసం పంట నష్టాన్ని అంచనా వేయటానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడతారు. స్మార్ట్ ఫోన్ల ద్వారా పంట కోత సమాచారాన్ని ఫొటోలు తీసి, అప్‌లోడ్ చేస్తారు. గతంలో ఎన్నో పంట బీమా పథకాలు ఉన్న కూడా తాము అకాల వర్షాలతో నష్టపోయే వాళ్ళమని... ఇప్పుడు ఫసల్ బీమాపై వ్యవసాయ అధికారులతో పాటు బ్యాంకు అధికారులు అవగాహన కల్పించడంతో తాము వ్యవసాయం అంటే కష్టం కాదని వ్యవసాయాన్ని ఇష్టంతో చేసుతున్నామని రైతులు తెలుపుతున్నారు.

# ట్రోల్స్‌కు భయపడి అవకాశాలు వదులుకున్నా

## ఐశ్వర్య లక్ష్మి




సోషల్ మీడియాలో వచ్చే ట్రోల్స్ తనపై ప్రభావం చూపించాయని నటి ఐశ్వర్య లక్ష్మి తెలిపారు. ట్రోలింగ్‌కు భయపడి గతంలో కొన్ని సినిమా అవకాశాలను కూడా వదులుకున్నానని ఆమె వెల్లడించినట్లు సినీ వర్గాల్లో వార్తలు వచ్చాయి. అయితే ప్రస్తుతం అలాంటి విమర్శలను పట్టించుకోకుండా తనకు నచ్చిన పాత్రలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలుస్తోంది.

# ‘పిఠాపురంలో.. అలా మొదలైంది’

## రిలీజ్ డేట్ ఫిక్స్




మహేశ్ చంద్ర దర్శకత్వంలో తెరకెక్కిన ‘పిఠాపురంలో.. అలా మొదలైంది’ చిత్రం సెప్టెంబర్ 18న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. డా. రాజేంద్రప్రసాద్, పృథ్వీరాజ్, కేదార్ శంకర్, మణిచందన, అన్నపూర్ణమ్మ తదితరులు నటించిన ఈ చిత్రాన్ని ప్రేమ, హాస్యం, కుటుంబ సెంటిమెంట్, తండ్రీకూతుళ్ల అనుబంధం నేపథ్యంలో తెరకెక్కించారు. హాస్య బ్రహ్మ బ్రహ్మానందం వాయిస్ ఓవర్ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. ఇప్పటికే విడుదలైన ట్రైలర్, పాటలకు మంచి స్పందన వచ్చినట్లు చిత్రబృందం తెలిపింది.




# రణబలి టీజర్ విడుదల

### విజయ్ దేవరకొండ మాస్ అవతార్.. రష్మికతో మరోసారి జోడీ

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు:
విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంటగా రాహుల్ సంకృత్యన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ‘రణబలి’ టీజర్ విడుదలైంది. బ్రిటిష్ పాలన నేపథ్యంలో రూపొందుతున్న ఈ పీరియాడికల్ యాక్షన్ డ్రామాలో విజయ్ దేవరకొండ రణబలి పాత్రలో పవర్‌ఫుల్ అవతార్‌లో కనిపించారు. బ్రిటిష్ అధికారుల అణచివేతకు వ్యతిరేకంగా పోరాడే వీరుడిగా ఆయన పాత్రను టీజర్‌లో చూపించారు. 1876--78 నాటి మద్రాస్ కరవు నేపథ్యాన్ని కథకు ఆధారంగా తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రంలో రష్మిక జయమ్మ పాత్రలో నటించగా, ఆర్నాల్డ్ వోస్లూ కీలక పాత్ర పోషించారు. ‘రణబలి’ అక్టోబర్ 16న ప్రేక్షకుల ముందుకు రానుంది.



# ఓనం సందడి

నటి, నృత్యకారిణి పూర్ణ అలియాస్ షమ్నా కాసిమ్ దుబాయిలో ఓనం వేడుకలను ఘనంగా నిర్వహించారు. తన డ్యాన్స్ స్టూడియోలో నిర్వహించిన ఈ వేడుకల్లో సంప్రదాయ దుస్తుల్లో సందడి చేసిన పూర్ణ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఓనం సందర్భంగా అభిమానులకు శుభాకాంక్షలు చెబుతూ పండుగ వేడుకల చిత్రాలను ఆమె పంచుకున్నారు.

Printed by RATNA GRAPHICS, At H.No. 2-3-703/7, Tirumala Nagar Colony, Police Lane, Amberpet, Hyderabad-500 013 Telangana.
Published by CHERUKU UPENDAR on behalf of HAMSA PUBLICATIONS, Printed at HYDERABAD and Pulblished at H.No: 7-83/2, HANUMAN NAGAR, KUNTLOOR, ABDULLAPUR MET MANDAL,Hayath Nagar, Pin: 501505, Rangareddy District/Hyderabad City,Telangana.
Editor : CHERUKU UPENDAR, E-mail: prabhathasuryudueditor@gmail.com PRGI Reg No : TGTEL/25/A0555